# రెక్కలు తెగిన పక్షి

రజనీ

తెలుగు కళాసమితి న్యూజెర్సీ–రాజ్యలక్ష్మి ఫౌండేషన్ వారి కథల పోటీలో ప్రథమ బహుమతి రూ. 3,000/–లు బహుమతి గెలుచుకున్న కథ




ఆ రోజు పొద్దుటి నుంచీ వద్దన్నా కళ్ళలో నీళ్లూరుతున్నాయి సావిత్రికి. ఎప్పుడూ యాంత్రికంగా ఇంటిపనులు చేసుకుపోయే సావిత్రి తనతీరుకి తనే ఆశ్చర్యపోయింది. ఆ కళ్ళలో ఇంకా నీళ్లున్నాయంటే వింతే మరి! ఇన్నాళ్లూ మనసుని పాతాళానికి తొక్కిపట్టి జీవితం నెట్టుకుంటూ వచ్చింది. కానీ.... కన్నపేగు విషయానికి వచ్చేసరికి సర్దుకోలేక పోతోంది.

రాత్రి భోజనాల సమయంలో రామారావు వాళ్ళకి వెంటనే ఉత్తరం రాసి

పడేస్తున్నాను. వచ్చేవారంలో తాంబూలాలు పుచ్చేసుకుంటే సగం పనులు అయినట్టే!" అన్నాడు స్వగతంలాగా.

వడ్డిస్తున్న భార్య, పదహారేళ్ళ కూతురు రాజీ ఇద్దరూ ఆమాటలు విన్నారు. వాళ్ళ అభిప్రాయమేమీ అక్కరలేదు రామారావుకి. కానీ.. మొదటి సారిగా భర్త నిర్ణయంపై నోరువిప్పింది సావిత్రి.




తెలుగు కళాసమితి న్యూజెర్సీ – రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారి కార్టూన్ల పోటీలో బహుమతి పొందిన కార్టూన్

"అప్పుడే దీనిపెళ్ళికి ఏమంత తొందర వచ్చిందండీ ! పదోక్లాసన్నా పూర్తి చెయ్యనివ్వండి" ఆమె మాటలోని అభ్యర్థనని రామారావు పట్టించుకోలేదు. అలా పట్టించుకోవడం అతని నైజం కాదు కూడాను.

"తొందర కనుకనే! ఆడపిల్ల బాధ్యత ఎంత త్వరగా వదల్చుకుంటే అంతమంచిది" నిష్కర్షగా చెప్పాడు. అతని మాటల వాడికి ముఖంలో కళ ఇంకిపోగా ఒకింత ఆశగా ఆందోళనగా కూతురివైపు తిరిగింది.

"నువ్వేమంటావే రాజీ! మీనాన్నగారు ఈ వేసవికాలంలో నీపెళ్ళి చేసెయ్యాలంటున్నారు. అలాఅయితే నీ చదువు ఆగిపోతుంది...." ఇంకా ఏదో అనబోయింది.

"అంతా నాన్నగారి ఇష్టమమ్మా! నాకేం తెలియదు" అనేసి తనగదిలోకి హడావిడిగా వెళ్ళిపోయింది రాజి. కొత్త ఆడియో కేసెట్లు ఆరోజే పంపించింది వాళ్ళ ఫ్రెండు. ఆ పాటలు ఎప్పుడు విందామా అన్న మూడ్‌లో వుంది కానీ తనగురించి తల్లి పడుతున్న ఆందోళన ఆ పిల్లమనసుకి ఎక్కినట్టు లేదు. నిరాశతో కూరుకుపోతూ సావిత్రి టేబిల్‌పైన ఉన్న గిన్నెలు తిరిగి వంటింట్లో పెట్టేపనిలో పడింది. తీరికగా కిళ్ళీనములుతూ హాల్లో టీవీ ముందు కూర్చున్నాడు రామారావు. గదిలో రాజి పాటలమత్తులో మునిగి ఏవోలోకాలలో విహరిస్తోంది. నిజంగానే రాజికి పెళ్ళంటే ఒక నిశ్చితమైన అభిప్రాయం ఏదీలేదు. ఆవయసుకి ఆపిల్ల తల్లిదండ్రితో కలసి నాలుగైదు పెళ్ళిళ్ళకి వెళ్ళింది. పెళ్ళంటే పూలూ బుక్కాలూ పట్టుచీరలు, చుట్టుపక్కల పలకరింపులు విందులు తప్ప లోతుగా ఎప్పుడూ ఆమె ఆలోచించలేదు.


అవ్వ ఎప్పుడూ చూసే సినిమాలు ఆపిల్ల మనసులో భర్తంటే ఏ... మధురభావాలు ఏర్పరచాయి. అందుకే తండ్రి హఠాత్తుగా పెళ్ళి నిర్ణయించినా ఆమె ఏమీ బెంబేలు పడిపోవడంలేదు. పైగా కించిత్తు కూడా విచారం లేదు!

ఆటపాటలతో స్నేహితుల సరదాలతో పూలనావలా సాగుతోంది ఆమె జీవితం. లోకమంతా పచ్చని చలువపందిరి వేసినట్టు చల్లగా హాయిగా వుంది. బ్రతుకంటే ఇదేనన్నమాట. నేను చాలా అదృష్టవంతురాలిని, దేనికీ లోటులేని కుటుంబంలో పుట్టాను. ఏదికావాలన్నా నాన్నగారు వెంటనే తెచ్చిపెడతారు. అమ్మ దగ్గరుండి కొసరికొసరి తినిపిస్తుంది. రేపు పెళ్ళయిన తర్వాత భర్త పువ్వులలో పెట్టి చూసుకోడూ....అదేదో సినిమాలోలా...తీయని తలపులతో రాజీ బుగ్గలు ఎరుపెక్కాయి. పెళ్ళి విషయం తండ్రికే పూర్తిగా వదిలివేసి ఆరాత్రి నిశ్చింతగా నిద్రపోయింది. నిజమే భర్త అన్న పదానికి రాజికి అర్థం అంతవరకే తెలుసు. కూతుర్ని చూసి సావిత్రి నిశ్శబ్దంగా నిట్టూర్చింది. ఆ వయసులో తమ మాత్రం! ఇలాగే వుంది. తండ్రి చూసిన సంబంధం మారుమాట్లాడకుండా ఒప్పుకుంది. పుట్టింట్లో అరగారాల మధ్య అన్నావదినల అనురాగబంధాలలో ఓలలాడి ఏడుమల్లెలెత్తు రాజకుమారిలా పెరిగింది. తెల్లవారి ఓ గంట ఎప్పుడన్నా ఆలస్యంగా నిద్రలేస్తే "నువ్వు లేచి ఇక్కడ ఏంరాచకార్యాలు చక్కపెట్టాలి! పడుకోవమ్మా మరదలా!" వదిన పరాగాలతో తిరిగి మంచంమీదకి తోసేది. కాపరానికి వచ్చిన మర్నాడు, ఆరోజులు గుర్తుతెచ్చుకుని నవ్వుతూ మంచం దిగబోయింది.

కర్ణకఠోరంగా వంటింట్లోంచి అత్తగారి గొంతు వినిపించింది. "బారెడు పొద్దెక్కినా ఇంకానిద్రేనా! ఇదెక్కడి చోద్యమమ్మా! ఆడపిల్లల్ని ఇలాగేనా పెంచేది. ఆ పుట్టింటారి తీరు ఈమెగారిని చూస్తేనే తెలిసిపోతోంది!" అత్తగారి సాధింపులు ముల్లులా గుచ్చుతుంటే చిన్నబోయిన ముఖంతో లేచి పక్కబట్టలు ఎత్తింది. "కూరలు నేను తరుక్కుంటాకాని పాచిగుమ్మం అలానే వుంది. శుభ్రంగా నీళ్లు చల్లి ఊడ్చు. నువ్వు అంట్లు తోమేదెప్పుడు? నేను వండివార్చి వాడి ఆఫీసుటైముకల్లా అమర్చకపోతే అగ్గిమీద గుగ్గిలం అయిపోతాడు!" ఈటెల్లాంటి మాటలతో హెచ్చరించింది. ఆరోజల్లా ఏపని చేస్తున్నా ఏదోవంక పెడుతూనే వుంది అత్తగారు. కళ్ళలో నీళ్లు కుక్కుకుంటూ అలవాటు లేక కందిపోయి మంటపెడుతున్న అరచేతుల్ని ఊదుకుంటూ ఆవిడ చెప్పిన పనులన్నీ చేసింది. కొడుక్కి పెళ్ళి అయేంతవరకు అంట్లకూ పాచికీ మనిషి ఉండేది అత్తగారికి. కోడలు వచ్చాక పనిమనిషెందుకు దండగ అని పనికిరావద్దని చెప్పేసిందట. అసలు ఇప్పుడు ఇంట్లో అదనంగా ఇంకో మనిషి తిండిభారం పడిందంటేనే గుండె గుభేలుమంటోంది ఆవిడకి. అసలే కొత్త కోడలు. కొడుకు సినిమాలు షికార్లు ఎక్కడ మప్పుతాడో అని ఓకంట కనిపెట్టేవుంది. ఇంటెడు చాకిరీ కోడలిపై వేసేసేది. మధ్యాహ్నం ఏ రెండుగంటలకో ఇన్ని పచ్చడిమెతుకులు చారునీళ్ళతో అన్నం పెట్టేది. అప్పటికే సగం ఆకలి చచ్చిపోయిన సావిత్రి ఏదో తిన్నాననిపించి లేచేది.

సాయంత్రం కొడుకు వచ్చేవేళకి తీరికగా వరండామెట్లపై కూర్చుని కోడలిమీద చాడీలు చెప్పేది అత్తగారు.

తెలుగు కళాసమితి న్యూజెర్సీ – రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారి కార్టూన్ల పోటీలో బహుమతి పొందిన కార్టూన్





## చలిలో గిలి

— బేతనపల్లి బోస్, *Fairlawn,*

ఒణుకుతుంది నా ఒళ్లు, చలికి
కావాలి తోటు ఒక కలికి
వుందా నా మాటల్లో వెకిలి?
ఇవ్వాలి నాకు నీ కౌగిలి!

ఆడదే మగవాడికి ఆస్తి
ఆస్తిలేకపోతే సుఖం నాస్తి
తెలుసుకోరా ఈ సూక్తి
అందులోనే, వుందిరా రక్తి

ఉండాలోయ్,కాస్త చొరవ
వుంటుందా ప్రేమకు చొరవ
కళ్ళలోనే వుంది 'కరెంటు'
పంపించెయ్, 'వారెంటు'





అటుభర్తకి వేళకి అన్నీ అమర్చి, ఇటు అత్తగారితో వెగ్గుకువచ్చేసరికి సావిత్రికి ఒంట్లో ఓపిక అంతా హరించుకుపోయేది. రామారావుకి బాత్‌రూములో నీళ్ళ దగ్గర్నుంచి అన్నీ అమర్చాలి. అతను స్నానం చేసొస్తే తువ్వాలు అందించాలి. అద్దం, దువ్వెన, బట్టలు భోజనం దగ్గర మంచినీళ్ళతో సహా అన్నీ యధావిధిగా వుంచకపోతే రామారావుకి కోపం వచ్చేస్తుంది. భార్యను దారుణమైన భాషలో తిట్టడానికీ, కొట్టడానికీ అతనేమీ సంకోచించడు.

సావిత్రి వేళకి అన్నీ అతనికి అమర్చిపెట్టడం ఎప్పుడో అలవాటు చేసేసుకుంది. మరో పదేళ్ళు గడిచేసరికి ఇద్దరు పిల్లల తల్లయి పాతికేళ్ళకే అరవయ్యేళ్ళ అనుభవాలు తెచ్చుకుంది.

కాస్త చదువుకుని వుంటే బాగుండేదేమో! రామారావు లాంటి కక్కుర్తి మనుషులు ఎలానూ ఉద్యోగం చెయ్యనిస్తారు. ఇలా ప్రతిపైసకీ అతనిపై ఆధారపడటం తప్పేది అని విచారిస్తూ వుంటుంది అప్పుడప్పుడు. తల్లికి తనచేత నానాచాకిరి చేయించిన రామారావు సావిత్రి తల్లి ఓసారి వైద్యంకోసమని వచ్చి నాలుగురోజులుంటే ముఖం మాడ్చుకున్నాడు.

"ఇల్లు మరీ సత్రంలా అయిందేమిటి. అల్లుడింట్లో ఇన్ని రోజులు వుండటానికి మీ అమ్మకి సిగ్గెయ్యడం లేదూ" అనేశాడు. పక్కగదిలో సావిత్రి తల్లి వింటూనే వుంది. మరో అరగంటకి పెట్టెసర్దుకుంది కూడా. సావిత్రికి చాలా అవమానమనిపించింది, నాలుగు రోజుల్లు అతడు తనతల్లిని భరించలేకపోయాడు. అతనితల్లితో తాను ఇన్నేళ్ళుగా ఎలా సర్దుకుపోతూ వస్తోంది. "ఆడపిల్ల ఇంటికి రావడం నాదేపొరపాటమ్మా!" తల్లి ఎంతగానో బాధపడి వెళ్ళిపోయింది. తల్లిని ఇంట్లో ఉంచుకుని వైద్యం చేయించి పంపించలేని తన అసహాయతకి సావిత్రి ఆరోజు గుండెలు పగిలేలా ఏడ్చింది. ఎన్నేళ్ళు ఎంతచాకిరి చేసినా ఇది పరాయి ఇల్లేనా, ఈ ఇంట్లో ఒకపనిమనిషిగా నేనా తనకి స్థానం? రామారావు వెలమొత్తానికిచాలా జాగ్రత్తగా కాలక్షేపం చేస్తాడు. ఎప్పుడైనా చేతిలో డబ్బులు ఆడితే హోటల్‌కో, సినిమాకో వెళ్ళి ఖర్చు పెడతాడు. భార్య చేతికి ఓపావలా ఇచ్చినా కూడా వంద ప్రశ్నలు వేస్తాడు. అతని తత్వం గ్రహించిన సావిత్రి ఎంతకష్టంలోనైనా అతనిని డబ్బులడగకూడదని ఏనాడో నిర్ణయించుకుంది. ఇల్లు శుభ్రంగా అందంగా అతనికి నచ్చేలా అలంకరించడం ఓ మంచి బానిసలా అతను చెప్పిన పనులు తలవంచుకుని చేసుకుపోవడం తప్ప స్వంత వ్యక్తిత్వాన్ని సావిత్రి ఏనాడో మరచిపోయింది. కాలక్రమంలో అత్తగారు గతించింది. పిల్లలు హైస్కూలు చదువుల కొచ్చారు. వంటిల్లు, పెరటిగుమ్మం తప్ప ప్రపంచంతో సంబంధాలు ఎప్పుడో తెగిపోయాయి సావిత్రికి. తోడబుట్టిన వాళ్ళు కూడా ఎవరు ఎక్కడ ఉన్నారో ఏం చేస్తున్నారో తెలిసే అవకాశం లేదు. భార్యతరపు వాళ్ళకి దూరంగా వుండాలన్నది రామారావు సిద్ధాంతం. అయితే తన తరపు బంధువుల ఇళ్ళలో ఏశుభకార్యాలు ఏతంతులు జరిగినా భార్యను వెంటపెట్టుకుని వెడతాడు. అత్తగారి వైపున అతను తెగతెంపులు చేసేసుకున్నట్టే. ఓ బానిసను అక్కణ్నుంచి డబ్బుతీసుకుని మరీ తెచ్చుకున్నాడు.

పనువుతాడు పేరుతో పలుగుతాడు కట్టాడు. ఇక అత్తారితో అవసరం తీరిపోయినట్టే. సావిత్రికి రోజులు యాంత్రికంగా నడిచిపోతున్నాయి. రక్షణ అనే మూడక్షరాల పేరుతో పురుషుడు స్త్రీ బతుకును ఎంత హీనంగా మార్చాడు! జీవితంలో కేవలం రక్షణకోసం పెళ్ళిఅనే ఊబిలో చిక్కి స్త్రీ నరకయాతన అనుభవిస్తోంది. కనిపించని సంకెళ్ళు కళ్ళుదాటని కన్నీళ్ళతో ఆమె లోకానికి గృహసామ్రాజ్యాన్ని ఏలే రాణిగా మాతృమూర్తిగా అందమైన పదాలలో కనబడుతుంది. కాని ఇల్లు అనే చెరసాలలో ఆమె ఖైదు అయిందనే నగ్నసత్యం ఎవరికి కావాలి. అనాదిగా స్త్రీ పురుషాహంకార ఇనుపపాదాల కింద నలిగిపోతూనే వుంది. పెళ్ళిపేరుతో ఉరితాడు ఎలానూ తప్పదు. అయితే చదువూ, ఉద్యోగమూ ఇవి వుంటే ఆడవాళ్ళ పరిస్థితి కొంచెం మెరుగు అన్న అభిప్రాయం ఉంది సావిత్రికి. రాజిని ఎలాగైనా పెద్దచదువులు



చదివించాలని పదేళ్ళుగా ఎన్నో కలలు కంది. కొడుకు రవి ముమ్మూర్తులా తండ్రి పోలికే. తల్లి కేవలం ఇంట్లో పనిపాటలు చూసే మనిషిలా కనిపిస్తుందా పిల్లాడికి. తండ్రి కామధేనువులా, కావలసింది కొనిపెట్టే దాతలా మహాపురుషుడిలా అగుపిస్తాడు. ఈ విషయంలో పిల్లలిద్దరి అభిప్రాయం ఒకటే. అవును ఏదో వెలిసిపోయిన చీర కట్టుకుని వాళ్ళు వదలిన ఎంగిలి కంచాలు తీసితోమడం, వీళ్ళు స్నానం చేసి బాత్‌రూమ్‌లో నిర్లక్ష్యంగా పారేసిన బట్టల్ని శుభ్రంగా ఉతకడం, వారానికి ఓసారి టాయ్‌లెట్ గదులు కడగటం వేళకి కాఫీటిఫిను భోజనాలు అమర్చుతూ రోజల్లా గడిపే తాను వీళ్ళ దృష్టిలో పనిమనిషిగా వంటమనిషిగా చాకలిగా ఉండక మరెలా వుంటుంది? ఇన్నాళ్ళు ఇలా నడిచింది. రాజీపెళ్ళి విషయంలో మాత్రం రామారావును ఎదిరించాలనే గట్టిగా స్థిరనిశ్చయంచేసుకుంది. ఆరాత్రి వంటింట్లో కూర్చుని తన భావాలన్నీ అత్తారింట్లో తనుగడిపిన దుర్భర జీవితాన్ని కాగితాలపై పెట్టింది. రాజి నిద్రలేచేసరికి ఎదురుగా కనిపించేలా వాటిని పెట్టి వెళ్ళి నిద్రపోయింది. ఇది చదివిన తర్వాత కూడా రాజి తేలికగా తీసిపారేస్తే ఏం చెయ్యాలి అని మర్నాడు ఉదయం తీవ్రంగా ఆలోచిస్తోంది. మరోప్రక్క అలవాటు ప్రకారం చేతులు చకచకా కాఫీని కలుపుతున్నాయి. ఏడుగంటలు దాటుతుండగా రాజి వంటింట్లోకి వచ్చింది. జేవురించి ఉన్న ఆమె ముఖాన్ని చూస్తూనే చాలావరకు అర్థం చేసుకుంది సావిత్రి. తల్లిని చుట్టేసి ఆమె గుండెల్లో తలదాచుకుంది రాజి.

"నాకేమీ తెలియడం లేదు. నువ్వు ఎలాచెబితే అలా చేస్తానమ్మా. నాక్కూడా ఇప్పుడు ఇంకా చదువుకుంటేనే బాగుంటుందని అనిపిస్తోంది." మెల్లిగా చెప్పింది.

సావిత్రి ఆనందంతో ఉప్పొంగిపోయింది.

"నేను చెప్పింది చక్కగా గ్రహించావు రాజీ. నువ్వు కూడా నాలా తొందరపడి రెక్కలు తెగిన పక్షివి కావద్దు" అని మనసులో దీవించింది. హైదరాబాద్‌లో తన స్నేహితురాలు నడుపుతున్న హోమ్‌కి రాజీని రైలెక్కించి పంపింది. రాజీని కంటి పాపలా కాపాడుతుంది తన ఫ్రెండు. రాజీ క్రమంగా కనుమరుగవుతుంటే ఆనందబాష్పాలతో చేయి ఊపింది సావిత్రి.

PLEASE PATRONIZE OUR ADVERTISERS